# నమశ్శివాయ

అర్చకత్వ మారంభించిన మొదటి దినములలో నమశ్శివాయ గుడిలోనికి వెళ్ళి ఎపుడు బయటికి వచ్చునో ఎవరికిని దెలిసెడిది కాదు. సంధ్యాకాలమున దేవదర్శనమునకు వచ్చిన భక్తులు లింగముముందు నందివలె మేలుకొనియే నిదురపోవుచున్న తనను లేపకముందే అతడు లేచి సాయంకాలపూజ ఆరంభించుచుండెడివాడు. కోడలు వచ్చువరకు అతనిభార్య పార్వతి పూలమొక్కలు పెంచి శివునకు పుష్పలావిగా నుండెడిది.

మల్లేశ్వరు డీ నమశ్శివాయను ఎంతో కాల మీ ధ్యానయోగమున నిలిపియుంచలేదు. కొబ్బరికాయలలో అరటిపండ్లో పసుపుగుంకుమలో పప్పుబెల్లములో మొక్కుబడులు రప్పించి అర్ధగించుచుండెడివాడు. నమశ్శివాయ హస్త మమృతహస్త మని బవాళా మోగెను. రోగు లందరు నతని చేతిమాత్రల కాసించుచుండెడివారు. అతఁడు పురాణము చెప్పుచుండగా కోకిల లాలకించుచుండెడివి. అతని గురుత్వమున గ్రామములో పలువురుభయ భాషలకును అందెవేసిరి.

నమశ్శివాయ తనకు పురుడుపున్నెములు వచ్చినపుడు అర్చన కడ్డురాకుండ అల్లుని గొనివచ్చి యిల్లరిక ముంచుకొని అతనికి భాగము పంచిపెట్టెను. నమశ్శివాయ కిపుడు కొడుకు. అతని పేరు మల్లయ్య. చేతికంది వచ్చెను. అతడును చదువరి. పయిగా మంచి సేద్యగాడు. అతని బావమరిది లింగయ్యయు వ్యవసాయమున గట్టివాడు.

ఈ రీతిగా నమశ్శివాయకు సంసారపు జంజాటము ముక్కాలుమువ్వీసము తగ్గిపోయెను. అతని కిపుడు దాదాపరువదేండ్లు. ఇట్టి మేలు తనకు కలిగినందులకు నమశ్శివాయ మిగుల సంతసించి మల్లేశ్వరున కొక మొక్కు మొక్కి తనయింటిలో ప్రవేశించినటులు గుడిలో ప్రవేశించెను. అల్లు గొడుకులలో నెవరో యొకరిపుడు మొక్కుబడులు మొదలగువానిని గొని దేవతకు నివేదించుచు నమశ్శివాయకు మేలుకొలుపులు లేకుండ జూచుచుండెడివారు.

మనసే దేవళ మయినవానికి గుడియయినను బడియయిన నొకటే యని యతనికి పుడు తోచెను. ఆత్మలింగము తెలియని యెడల లింగము రుబ్బుపత్రమే యను నొక ఎరుక అతనికి కలిగెను.

నమశ్శివాయ నిత్యమును గ్రామప్రదక్షిణము చేయుచు ఊరి నడుమ నున్న రావిచెట్టు చుట్టుగూడ తిరుగును. ఆ ప్రదక్షిణములో కుక్కయేని గాడిదయేని గానబడినచో-

"మంచివా డెవండు మల్లయ్య కంటెను
కుక్కయందు రేవుగుఱ్ఱమందు
దివుటనిల్చి మాకు దేహాభిమానంబు
మాపువాడయా నమశ్శివాయ"

అని వానిచుట్టును ప్రదక్షిణముచేసి వచ్చుచుండెను. కొందరు నమశ్శివాయకు వెఱ్ఱియెత్తినదని అనుకొనిరి. మరికొందరతని వాక్యములను మహా వాక్యములుగా తలపోసిరి. అట్టి సమయమున అతడింటి బరువంతయు కొడుకు భుజముల మీది కెత్తి శ్రీశైలము మొదలగు క్షేత్రములకు పోయెను. నమశ్శివాయ పొల మించుమించిరువ దెకరములు. ఆ పొలమంతయు పోటు మెరక. నమశ్శివాయ తన భుజబలమువలన దాన సాబాలు మాత్రమే మాగాణి చేయగలిగెను. మిగులు సాబా లిపుడతనికొడుకును అల్లుడును ఆయకట్టులో చేర్పించి సొంత కమతము చేయ దొడగిరి.

వారి పాటు చక్కగా అక్కరకు వచ్చెను. పొల మంతయు జదరమై వచ్చిన కొలది పంటంతయు క్రమముగా పెరుగుచువచ్చెను. నమశ్శివాయ కొడుకున కొక కొడుకును, కూతున కొక కూతును గలిగిరి. ఇటులు సంసారమును తమ కృషియును ఫలించి నందులకు బావమరదు లిరువురకును శివుని మీద భక్తి యెక్కువగుచు వచ్చెను. ఇటులు తన సంసారవృక్షము చిలవలు వేసి పూచి కాచి పండుచుండగా నమశ్శివాయకు అది యంతయు జూచికొని ఆనందించు భాగ్యము లేకపోయెగా యని పార్వతి వగచుచు వచ్చెను.

## 2

ఎండోమెంటొస్ బోర్డువారి ఇన్‌స్పెక్టరు ఈలపల్లిలో దిగెను. బస్సు బుస్సుమనుచు వెళ్ళిపోయినతరువాత అతడు తనచుట్టు తానొక ప్రదక్షిణముచేసి ఊరంతయు కలయగాంచెను. పది పండ్రెండు డాబాలును, నలుబది యేబది పెంకుటిండ్లును, ఇన్నూరు మున్నూరు పూరిండ్లును వాని నడుమ దేవాలయమును అతనికి గానబడెను.

అర్చకుడును అతని వెనువెనుక కరణము మునసబులును వచ్చి ఆతిథ్య మిచ్చి అతనిని రచ్చసావడిలోనికి దీసికొనిపోయి అచట విడియించిరి. అతడు ప్రయాణపు బడలికను సడలించుటకు అర్చకునకు సెలవొసగి మంచముమీద మేను వాల్చెను.

అంతట కరణము మునసుబులుగూడ - "మాకు గూడ సెలవు దయ చేయింపుడ"ని వేడుకొనిరి.

"ఉండు దుండుడు. మీతో మాటలాడుటకే అర్చకుని బంపివైచితిని."

"చిత్తము చిత్తము."

"మీ యూరిలో దేవాలయ మే స్థితిలో నున్నది?"

"మంచిస్థితిలోనే యున్నది."

"పూజారి."

"చెడ్డవాడు - కాడు."

"మీ దేవాలయమునకు ట్రస్టీల నేర్పాటు చేయుటకు వచ్చితిని" అని ఇన్‌స్పెక్టరు చెప్పుచుండగా నచటికి ఇరువురు వచ్చి కూర్చుండిరి.

"మీ రెవరు."

"ఈ ఆలయము కట్టించిన ఈలపల్లివారి వంశములోనివారు. వీరు చలమయ్యగారు, వారు మల్లికార్జునుడుగారు" అని కరణము చూపి చెప్పెను.

"మంచిది. మీ దేవళమునకు ట్రస్టీ నేర్పాటుచేయ వచ్చితిని."

"అంతయు తిన్నగా నున్నపుడు ట్రస్టీ లెందులకండీ?" యని చలమయ్య అనెను.

"నేడు తిన్నగా ఉండవచ్చును.రేపు ఉండకపోవచ్చును."

"ట్రస్టీ తిన్నగా నుండకపోయినచో?" అని మల్లికార్జును డనెను.

"బోర్డువారే యున్నారు."

"ఇది మాటసొంపే కాని పని కంపు. ఎక్కడి ఈలపల్లి? ఎక్కడి చెన్నపట్నము? కాసుగొడ్డుకు రూకబందె" అని చలమయ్య అనెను.

"ధర్మకర్తలే యిటులనినచో నెటులయ్యా? పొరుగింటివాడు పాడిగేదె అంటే ఇంటివాడు గొడ్డుగేదె అన్నట్లు?"

"దేవళమున అర్చన తిన్నగా జరగనియెడల ఊరివారే పూజారికి చెప్పి తిన్నగా జరిపింతురు. ఉత్సవములు ఊరేగింపులు వారే జరిపించుకొనుటలేదా? ఉన్నది ఊదివేయుటకా ట్రస్టీలును గ్రస్టీలును?" అని మల్లికార్జునుడనెను.

"మీ అందరదియు ఒకటే కూత యేమయ్యా? ఏ వాడ చిలుక ఆ వాడ పలుకు."

"పెద్ద రాబడిగల దేవళములకు సర్కారువారి ఆబ్కారీ ఉండిన ఉండవచ్చు" అని చలమయ్య అనెను.

"ధర్మాదాయముల నన్నిటిని ఒక మేరలోనికి తెచ్చుటకు ఈ ఎండోమెంట్స్ బోర్డు ఏర్పడెను. దానికి చిన్న పెద్దలు లేవు. దాని కీలపల్లిలో ఈశ్వరాలయమును తిరుపతిలో వెంకటేశ్వరాలయమును నొకటే. దానికిని ట్రస్టీ లున్నారు. దీనికిని ఉందురు. అది లా."

"ఏమి లా అండీ? తిరుపతికి లక్షలకొలది రాబడి. ఈలపల్లి మీ కంట్రిబ్యూషనుతో సఫా. ఈ యూరిజనాభా రెండువేల పైచిలుకు. ఇందులో రెండుపార్టీలు. ఈ స్థితిలో తమరు ట్రస్టీల నేర్పాటు చేసినచో ఇక చెప్పవలెనా సౌభాగ్యము?" అని మల్లికార్జును డనెను.

"పార్టీ లున్నపుడే మజా. ఆ పార్టీలో కొందరను ఈపార్టీలో కొందరను దేవళము లోనికి పిలిపింపుడు."

మోతాదు గ్రామములోనికి వెళ్లెను. కొలది సేపటిలోనే యిరువాగులవారును ఒకనూరుమంది దేవళమున జేరిరి. ఇన్స్‌పెక్టరుగారి రాకకు కారణ మందరకు నెరుకపడెను.

రెండు పక్షములవారును కరణమును ట్రస్టీగా నెన్నుకొనిరి. అంతట ఇన్స్‌పెక్టర్ లేచి దేవళముల, అర్చకుల, ట్రస్టీల, పంచాయతీల, ధర్మాదాయములగూర్చి ఒక చిన్న యుపన్యాస మిచ్చెను.

ఆ యాలయముమీదను, ఆ యర్చకునిమీదను, ఆ యాదాయముమీదను తమలో ప్రతివానికిని హక్కు కలదని ఈ సభలోని వారికందరకును ఒక కొత్త సత్య ముద్బుద్ధ మాయెను. తమకింత కంటె భారమగు నొక విధి యున్నదని వారికెవరికిని తోపలేదు.

## 3

కరణము యాజమాన్యమున నొక ఏడాది తిన్నగనే గడిచిపోయెను. మరుసటి యేడుగూడ మునసబు యాజమాన్యమున ప్రశాంతముగనే గడవ వచ్చుచుండెను. అట్టి సమయమున మల్లయ్యకును అతని పొరుగు ఆసాములిరువురకును పశువులపాక గోడల గూర్చి ఒక చిన్న తగవు వచ్చెను. ఆ తగవిది:

నమశ్శివాయ పసులపాకగోడ ముదికివానల వలన పడిపోయెను. వెంటనే కొత్తగోడ పెట్టినయెడల నిలువజాల దని మల్లయ్య దాని నటులనే ఉంచెను. అతడు తండ్రి సంగతి సందర్భములు కనుగొనుటకు సుదూరము వెళ్ళిన తరుణమున ప్రక్క ఆసాము లిరువురును ఆ గోడ తమ భాగము లోనికి వచ్చునటులు చిళ్ళకంప తెచ్చి పాతిపెట్టిరి. మల్లయ్య మారూరినుండి తిరిగి వచ్చిచూచునరి కా చిళ్ళకంప చిళ్ళలుపెట్టి నవనవలాడుచు పెరుగుచుండెను. ఈ కంటకములను శోధించుచో తనచేతులకేకాక తన ఆస్తికిని

కంటకములు గ్రుచ్చుకొనగలవని పొరజూచి మల్లయ్య కరణము మునసబులకు విన్నవించుకొన నేగెను.

ప్రక్క ఆసాములకు అది తెలిసి తమతమ వాదములను తెలుపుటకు రచ్చసావడి కేగిరి.

కరణము మునసుబులు వచ్చి చూచి మల్లయ్య పక్షముననే తీరుపు చెప్పిరి. తగవు చూడవచ్చిన గ్రామస్థులు – "ఇంకను ఊరక చూచెదవేమయ్యా? పీకు. చిళ్ళకంప పీకు. నీ వాకటి పీకుటయే తరువాయి. ఇది నీ నట్టిల్లు" అని మల్లయ్యకు మెల్లగా చెప్పిరి. అది విని మల్లయ్య చేయిచేసికొనెను. పిదప వేయిచేతులు పడెను. ఆ రంగమును జూడలేక ప్రక్క ఆసాము లిద్దరును అటనుండి తప్పుకొనిరి. ఇది జరిగిన కొన్ని దినములకు... ట్రస్టీయును అర్చకులునుకలిసి దేవద్రవ్యమును అపహరించుచున్నార"ని బోర్డువారికి కొన్ని విన్నపములు చేరెను. ఆ విన్నపములాలించి అసిస్టెంట్ కమిషనరుగారు వీరాచారిగారిని వెంకునాయుడుగారిని సారథి జియ్యర్‌గారిని ట్రస్టీలుగా నియమించెను.

ఇది జరిగిన కొన్నాళ్ళ తరువాత వీరాచారి జిల్లాకోర్టు వారి కొక విన్నప మిటులు చేసికొనెను. : –

"ఈలపల్లి మల్లేశ్వరస్వామివారి దేవాలయపు ట్రస్టీలు కొలువుతీరి నన్ను మేనేజింగ్ ట్రస్టీగా ఎన్నుకొనిరి గావున హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ ఆక్ట 78వ సెక్షన్ చొప్పున సదరు మల్లీశ్వరుని మాన్యములను అన్నిటిని దేవాలయముతోసహా నాకు పొజిషన్ చేయగోరుచున్నాను."

ఈ విన్నపము కోర్టువారి పరిశీలనములో నుండగా పంటకాలమున వీరాచారి మరియొక విన్నప మిటులు చేసెను : "పంట కోయు తరుణము సమీపించుచున్నది. ఈ దేవుని మాన్యములకొక రిసీవరు నేర్పాటుచేసి యీ పంటమీద వచ్చు ఆదాయమును కోర్టులలో నిలువ ఉంచగోరుచున్నాను. ప్రతివాదులు బలవంతులు. వారికి లోగడ ట్రస్టీలుగా వ్యవహరించిన కరణము మునసబుల అండ కలదు. ఈ బలముతో వారు పంటనంతయు నపహరింపగలరు. కావున వెంటనే పోలీసు మద్దతు ఇప్పించ గోరుచున్నాను."

వీరాచారి యీ రెండవ విన్నపము ప్రకారము రిసీవరు విచ్చేసెను. పోలీసు బందోబస్తుతో పంట వేలము వేసి వచ్చిన సొమ్మును కోర్టు కప్పజెప్పెను.

ఇది జరిగిన కొలదికాలమునకు కోర్టువారు వీరాచారి మొదటి విన్నపము నాలించి యిటులు తీరుపు వ్రాసిరి : ఈ దేవమాన్యము లన్నియు మల్లేశ్వరస్వామివారివే యని

శ్రీ వీరాచారిగారు ఎండోమెంట్స్ బోర్డువారికి ప్రమాణపత్రమును జూపి సదరు దేవమాన్యములను, దేవాదాయమును, దేవాలయమును స్వాధీనపరచుకొనవచ్చును."

కోర్టువారి యాతీరుపు చూచినవెంటనే వీరాచారి ఎండోమెంట్స్ బోర్డువారి ఉల్లాకు చూపి కోర్టులో నిలువయున్న ధనమును, తన నిలువడబ్బును తీసికొనినటులు తీసికొనెను. మాన్యములను దేవాలయమును స్వాధీనపరచుకొనెను.

"చిల్ల కంప పీకినటులు కాదు. ఇపుడు దాని సంగతి తెలిసి వచ్చును లే" అని మల్లయ్య హంసాయి వెంకునాయడనెను.

"పిల్లకాకి కేమితెలుసురా ఉండేలుదెబ్బ" అని రెండవ హంసాయి వీరాచారి యనెను.

## 4

నమశ్శివాయ ఎచట నుండెనో ఎవరికిని తెలియదు. వీలయినపుడెల్ల మల్లయ్య అతని యునికిని గురించి పెద్దపెద్ద శివక్షేత్రములన్నియు గాలించి వచ్చుచునేయుండెను. విఫలుడై మల్లయ్య యింటికి జేరినతరువాత మామగారిని వెతకి తెచ్చుటకు లింగయ్య దేశము లన్నియు తిరిగి వృథాగా వచ్చుచుండెను. ఇటు లీ యిరువురకును అనుకొనకుండగా దేవదర్శనము చేయించిచేయించి ఒకానొకనాడు నమశ్శివాయ ఏడనుండియో ఊడిపడెను. పార్వతి ఆనాడు మరల పెండ్లికూతురై సిగ్గుతో భర్తకు పరిచర్య చేసెను. మల్లయ్య తండ్రి పాదములు కడిగి తడి యొత్తెను. అల్లుగూతుండ్రును పరుగువెత్తుచు వచ్చి సాష్టాంగ ప్రణామము చేసి దవుదవుల గూరుచుండిరి.

ఏయే క్షేత్రములం దేయేమహత్తులు చెప్పునో యని గ్రామవృద్ధులు పలువు రతనికడకు వచ్చి కూరుచుండిరి. వారికంటి ముందతనికడ చదివికొనినవారు పలువురు బిలబిల మూగిరి.

"ఊరి మార్చే కాని మల్లయ్య మార్పు లేరు" అని నటుల నమశ్శివాయ మాటలాడక చూపుడువ్రేల మల్లేశ్వరుని జూపుచు కూరుచుండెను.

అతడు కొన్నాళ్లనుండియు మౌనవ్రతములో నుండెను. అది ఎవరికిని దెలియదు. నమశ్శివాయకు పిచ్చియేకాక మూగతనముగూడ వచ్చెనని అందరు ననుకొని దుఃఖించుచు బోయిరి.

తాము తినుటకుగాని, దేవునకు బెట్టుటకుగాని యింట గింజలు "గుడిమణివము చేయరాదనియూ, మల్లయా, మేము నీ కిచ్చిన మా పొలము లాగుకొంటివి?" అని మల్లయ లింగయలు మల్లయముందు గూర్చుండి ఆలోచించి ఆలోచించి ఎడ్ల నమ్మి అప్పుసొప్పులు తీర్చి మిగిలిన కొలది పైకము పెట్టి గింజలు కొనిరి.

గ్రామములో రైతు లందరును పొలములలో మెరలు తీసి ముంగిళ్ళ వలె సమపరుచుచుండిరి. తమ కింతకు పదిరెట్లు పంటకుప్ప లీయవలయు ననునటులుగా ఎరువు కుప్పలుకుప్పలుగా బోయుచుండిరి. దప్పికి నోరు విప్పిన చందముగా భూమి బల్లున పగిలి బీటికలు నిచ్చెను. గొడ్లకాపరులు గబగబ పరువిడుచు ఆ బీటలలో దిగబడి అనూరులగుచుండిరి. పాడి పసరములు తక్క మిగులు పసరము లన్నియు చేలలోనే నిలిచి తాము తినిన పచ్చలకు బదులుగా నీలము లొసగుచుండెను.

వీరాచారి చిన్ననాటినుండియు కోర్టు-పక్షి. అతడు వ్యాజ్యములు కొనుచు అమ్ముచు బేరములు చేసిచేసి దివాలాలు తీసి తీసి 'లా' యంతయు తెలిసికొనెను. అతనికి సెంటుపొలము లేదు. అతడు సేద్యమునకు పుట్టుగ్రుడ్డి ఎద్దులేదు, తాడు లేదు. ఇంట విస్తరియు నీరు తక్క మరియేమియు లేదు. ఇట్టి స్థితిలో కోర్టువారి దయవలన ఈ యిరువదెకరముల దేవమాన్యమును తన యాజమాన్యమునకు వచ్చెను. మిడిసిపడి సేద్యము చేసెనా మిగులునది విత్తనములకేని సరిపోదు. మల్లయ్య తనచేతిలో బడినను తన యాజమాన్యమున కాయువెంతో తనకు తెలియదు. ఇది యంతయు సాంగోపాంగముగా నాలోచించి వీరాచారి లోపాయకారిగా దేవమాన్యములను వెంకునాయడుకును సారథి జియ్యరుకును కౌలు కిచ్చెను. ఏరువాక పున్నమ దాపురించెను. అందరును నారులుపోసి పెంచుకొనుచుండిరి. మల్లయ్యకును లింగయ్యకును ఏమి చేయను పాలుపోలేదు. గ్రామము విడనాడి మరియొక గ్రామము చేరుటకా ధైర్యము చాలదు. గ్రామములోనే యున్నచో దేవుని నైవేద్య దీపారాధనలకును తమ తిండితిప్పలకును ఆధారము లేదు. మల్లయ్య మ్రోల ఎంతమొత్తుకొన్నను అత డులకడు, పలుకడు.

వా రిరువురును ఆలోచించుకొని ఒక దారికి వచ్చిరి. ఆరు మూడయినను గ్రామము విడనాడరాదు. మల్లయ్యను మరువరాదు. వ్యాజ్య మాడరాదు. ఈ యభిసంధితో మల్లయ్య కరణముగారి యింటికిని, లింగయ్య మునసబుగారి యింటికిని వెళ్ళిరి. కరణము ఇంటలేడు. మునసబుగారును ఇంటలేరు. వారిరువురును రచ్చసావడిలో నుండిరి. మల్లయ లింగయలును రచ్చసావడికే పోయిరి.

"ఇటు ఇటు" అని కరణము మునసబు లిరువురును ఆ యిరువుర నాహ్వానించిరి. మల్లయ లింగయలు వారి యిరువురికడ చేతులు కట్టుకొని నిలువబడి "మే మిరువురమును మీ యిరువురకడ పాలేళ్ళముగా నుండదలచి వచ్చితిమి" అని ఏకగ్రీవముగా మనవి చేసిరి.

కరణము మునసబు లిరువురును తెల్లబోయిరి. మరు నిమిషమునకే యథాప్రకారమునకు వచ్చి – "మాకు పాలేళ్లు లోగడనే కుదిరిరి" అని కరణమనెను. మునసబు లోలోపల కరణము మనసు పసికట్టి చిరునవ్వు నవ్వెను.

"మే మొక బస్తా తక్కువకే ఉందుము" అని లింగయ్య అనెను.

"రెండు తక్కువ ఐనను ఉందుము" అని మల్లయ్య అనెను.

"రేపు మా యింటికి రండు. ఆలోచింతము" అని కరణమనెను.

గ్రామము ప్రదక్షిణించుచున్న నమశ్శివాయ చెవులలో ఈ మాటలు గంట కొట్టినటులు వినబడెను.

## 5

కరణము మునసబు లిరువురును ఆడంగులు బొడంగులు తీసిచూచి యిటు లొక కాకితము వ్రాసిరి : –

నమశ్శివాయగారు ఈలపల్లిలో వేంచేసియున్న శ్రీమల్లేశ్వరులవారికి వారసులుగా ఉన్న అర్చకులు వీరి తాత ముత్తాత లందరదియు ఈలపల్లియే. వీరి వంశకర్తలే ఈ ఆలయము పుట్టిననాటి నుండియు నేటి వరకును విడువక అర్చన చేసికొనుచు వచ్చుచున్నారు. ఇచట వీరికి పొలము పుట్ర ఉన్నది.

"ఈ యాలయము సుమారు నూరేండ్లనాటిది. శివభక్తులను మంత్రిశేఖరులును అగు ఈలపల్లి వియ్యన్నమంత్రిగారు దీనిని కట్టించిరి. వీరు జమీందారుకడ తమకు గల పలుకుబడి నుపయోగించి నిత్య నివేద్య దీపారాధనములను చేయుకొరకు అర్చకునకు గల పొలముమీద శిస్తును మాఫు చేయించిరి. ఆ శిస్తు నూటరెండు రూపాయలు.

"ఇవి దరిమిలా యీనాములని జమీందారీ లెక్కలలో గలదు. ప్రతి పొలమునకును శేరీ పన్నులెక్కయు దాని మాఫీయు ఈ లెక్కలలో నున్నది. ఈ యాలయముగాని యీ యీనాములుగాని యీనాంకమీషనర్ వారి జూరిస్‌డిక్షన్ కిందికి రాలేదు. ఈ పొలముల గురించి యీనాం స్టేట్‌మెంట్ లేదు. ఈనాముల ఫెయిర్ రిజిస్టర్లో వీని పత్తాలేదు.

"కాబట్టి ఎండోమెంట్స్ బోర్డ్‌వారి కధికారము లేదు. ఉన్నయెడల సదరు శిస్తు నూటరెండు రూపాయలమీదనే"

మల్లయలింగయలు వచ్చి యీ కాకితము చూచిరి. దీనిలోని ముఖ్య విషయములు మల్లయకును తెలియును. మల్లయ్య తాత మల్లయ్య, యీ విషయములు నమశ్శివాయకు అతని యిరువదివయేట చెప్పెను. నమశ్శివాయ తనకు తన యిరువదవయేట చెప్పెను.

"ఏమి సెలవు" అని లింగయ్య తమ కమత ముండుటను గూర్చి అడిగెను.

"మీరు ట్రస్టీలమీద దావా దాఖలు చేయుడు. ధనము లేనిచో మేము పెట్టుబడి పెట్టెదము. దానిని మెల్లగా తీర్చుకొనవచ్చును. పొలములకు బోయి వారు దున్నుచున్న నాగళ్ళను విప్పివేయుడు. మీ పొలము నంతయు మీ స్వాధీనములోనికి తెచ్చుకొనుడు. మీరు నాగళ్ళు కట్టి దున్నుడు. ఊద్బింపుడు" అని కరణము మునసబు లేకకంఠముగా అనిరి.

"మా నాగళ్ళను వారూడదీయుచో?" అని మల్లయ్య అనెను.

"కొంతమందిని కూర్చుకొని దున్నింపుడు" అని కరణమనెను.

"దొమ్మి జరుగుచో?"

"నిర్వహింప వలెను."

"ఇంత యైనను దావా ఓడుచో?"

"ఓడరు, ఓడరు. సరియగు ఆధారము లేనిచో మఠములకు గాని దేవాలయములకు గాని పూర్వము నుండియు వచ్చుచున్న ఏర్పాటులనుగాని హక్కులనుగాని మరియాదలను గాని వచ్చుబడులనుగాని మామూళ్ళనుగాని హిందూ ధర్మాదాయపు చట్టమునుబట్టి తోసివేయరాదు" అని 79వ సెక్షన్‌లో విస్పష్టముగా వ్రాసియున్నది. ఈ యాలయము పుట్టినప్పటి నుండియు మీకు పన్ను మాపీ చేయబడినది. ఆ పన్ను మాపీకి మింజుమలె మీరు అర్చన చేయుచుంటిరి. ఈ రీతిగా మీకు కాగితపుబలమున్నది. అంగబల మున్నది. అర్థబల మున్నది" అని యిటులు కరణము చెప్పుచుండగా ఆ పక్షమువారిలో నొకడును ఈపక్షమువారిలో నొకడునుగా ఉభయపక్షములలో నున్న పెంకెతలకాయ లన్నియు పోగుపడెను.

మల్లయ్య యిటులనెను – "యుద్ధమును వ్యాజ్యమును ఒకటి. ఈ రెంటను జయాపజయములు తెలియరావు. జర్మనీ జయించునని అందరనిరి. అదియే ఓడెను. అటుల మేమోడుదమేని మా ఆస్తి యంతయు ఋణములో వీసపాలుకును రాదు. అటులు ఋణమున పడిపోవుటకంటె మీ కొడలమ్ముకొని కొలమువేలుపును కొలుచుచు మే మింత తినబడయగలుగుట మేలుకదా."

"కరణమువారు కావలసినంత ఉసి యీయగా నీ కెందులకయ్యా యీ తంబళి అనుమానము?" అని ఒకడనెను.

"తంబళి తన లొటలొటేగాని ఎదుటి లొటలొట ఎరుగడు" అని సామెతయే యున్నదని యింకొక డనెను.

ఈ మాటల కెదిరి పక్షమువారి కను లెఱ్ఱబడెను.

"రేపు రండయ్యా మాటాడుకొందము" అని కరణము పలుకగనే మల్లయ లింగయలు సెలవు తీసికొనిరి.

– "పూజారి వద్దు మొఱ్ఱో అనుచుండగా కరణాని కెందుకురా అదిరిపాటు?" అని సారథిజియ్యరు లేచెను. కరణముగారి మోతాదు "వారును వారును ఏదో మాటలాడుకొనుచుండగా జియ్యరు కెందుకురా ఉలికిపాటు?" అని లేచెను.

అంతట అందరకును రోసములు పెరిగెను. ఆకాశమున కఱ్ఱలు లేచెను. కఱ్ఱలును బుఱ్ఱలును కసకస లాడునంతలో "దారి, దారి" అని నమశ్శివాయ మేఘ గంభీర ధ్వని అందరకును వినవచ్చెను. కొత్తగా వినవచ్చిన ఆ చిరపరిచిత ధ్వని నందరు నాదరించి పాయదొలగి కఱ్ఱ వాల్చి ఆశ్చర్యముగా జూచిరి.

నమశ్శివాయ డాచేతిని వలపర చేతిని ఎత్తి ఎక్కడివారి నక్కడ కూరుచుండజేసి సూటిగా కరణముమునసుబుల ముంగలికి వెళ్లి – "అయ్యా లోకుల వంకరను మీ రెటులు దిద్దగలరు? మల్లయ్యయే తనమీది చంద్రవంకను దిద్దుకొనలేకపోయనే! ఇంతమంది అన్నపూర్ణలుండగా మల్లయ్యకుపవాస ముండదు" అని తన వెనుక వచ్చి అల్లు గొడుకులను జూచి "నాయనా మీ పాత్రయు అక్షయ మగుగాక. మీరు నావలెనే జోలెలు గొని ప్రక్కయూళ్లకు పోయి భిక్ష గొని వత్తురుగాక అని తనమీది ఉత్తరీయమును రెండుగా చింపి యిరువురిమీదను బడవయిచి, రెండడుగులు ముందులకు నడచి, ముంగిలిలోనికి జని – " భవతి భిక్షాం దేహి" అని జోలెపట్టెను.

● *భారతి – ఆగష్టు – 1949* ●